క్లుప్తంగా

ఆధార్ అనుసంధానం చేసుకోండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: సచివాలయాల పరిధిలో ఉన్న ప్రజల ఆధార్‌కార్డులతో బ్యాంకు ఖాతాలను అనుసంధానం చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. 23,24 వార్డు సచివాలయాల్లో గురువారం జరిగిన స్పెషల్ డ్రైవ్‌ను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ పేమెంట్స్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ఖాతాను అప్‌డెట్ చేయడం, కొత్త ఖాతాలు ఓపెన్ చేయడం వంటివి సచివాలయాల పరిధిలో చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలు అందలాలంటే తప్పని సరిగా ఈ ఖాతాల అప్‌డేట్ అయి వుండాలని తెలిపారు. ముందుగా స్వరాజ్‌టాకీస్ వద్ద జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

విధులు సమర్థంగా నిర్వహించండి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి



తెనాలిఅర్బన్: విధులను సమర్థవంతంగా నిర్వహించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి సూచించారు. పట్టణంలోని 19,23,24 వార్డులలో గురువారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న చెత్త సేకరణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందరూ బాధ్యతతో పనిచేస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని చెప్పారు. ఆయన వెంట మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలిఅర్బన్: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పిలుపునిచ్చారు. 7,8 వార్డులలో గురువారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురుగు కాల్వలపై మెట్లు, నాపరాళ్లు వేయడంవలన కాల్వల పూడికతీత పనులకు అవి అవరోధంగా మారుతున్నాయన్నారు. మురుగు కాల్వలపై ఎటువంటి నిర్మాణాలు జరపవద్దని సూచించారు. ఆమె వెంట ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఏఈ సూరిబాబు, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

పాస్టర్ ఇశ్రాయేలుకు దైవజనుల నివాళి

తెనాలి: పట్టణ అయితానగర్ ప్యాడిసన్ పేట నోవాహు ఫుల్ గాస్పెల్ చర్చి సంఘ కాపరి , తెనాలి యునైటెడ్ టౌన్ పాస్టర్స్ అసోసియేషన్ నాయకుడు పాస్టర్ ఆరుమళ్ల ఇశ్రాయేలుకు గురువారం పలువురు దైవజనులు నివాళులర్పించారు. దేవుని సేవలో ఎన్నో ఏళ్లుగా పరిచర్య చేస్తున్న ఇశ్రాయేలు బుధవారం సాయంత్రం అయితానగర్‌లోని స్వగృహంలో మృతిచెందారు. తెనాలి యునైటెడ్ టౌన్ పాస్టర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బిషప్ కె.సుధీర్ కుమార్, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బిషప్ కూచిపూడి అబ్రహాం, దైవజనురాలు కె.సంతోషి కుమారి, దైవజనులు బ్రదర్ ఆనందన్న, రెవరెండ్ పల్లె శామ్యూల్, రెవరెండ్ వై కృపాదానం, బ్రదర్ గిద్యోను, త్యాగరాజులు ఇశ్రాయేలు భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. గురువారం మధ్యాహ్నం అంత్యక్రియలు చేసినట్టు పాస్టర్ కె.విలియం కేరి తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

తెనాలి: ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక గంగానమ్మపేటలోని రోహిణి హాస్పటల్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ వినీల్ ఆధ్వర్యంలో 150 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు, ఓపీ, రక్తపరీక్షలు చేశారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

హిందూ చైతన్యవేదిక నిరసన

తెనాలి: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో గురువారం రాత్రి స్థానిక గాంధీచౌక్‌లో నిరసన ప్రదర్శన చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ నినాదాలు చేశారు.

శవాగారానికి సమస్యలు !

- కుళ్లిపోతున్న మృతదేహాలు
- నూతన బాక్సుల కోసం ఎదురు చూపులు

తరచూ మొరాయిస్తున్న ఏసీ బాక్సులు



జిల్లా వైద్యశాలలోని శవాగారం



రిపేర్లు వస్తున్న ఏసీ బాక్సులు ఇవే

తెనాలిఅర్బన్: పట్టణంలోని జిల్లా వైద్యశాలలోని శవాగారం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. శవాగారాన్ని అధికారులు ఇటీవల కొంత అధునీకరించినప్పటికీ అందులోని రెండు ఏసీ బాక్సులు తరచూ మొరాయిస్తున్నాయి. వాటికి రిపేర్లు చేయించలేక కొత్త వాటిని ఏర్పాటు చేయించాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు. తెనాలి జిల్లా వైద్యశాలలో 2000 సంవత్సరంలో శవాగారాన్ని ఏర్పాటు చేశారు. తెనాలి, కొల్లిపర, కొల్లూరు, దుగ్గిరాల, వేమూరు, చుండూరు, అమృతలూరు తదితర మండలాల పరిధిలో రోడ్డు ప్రమాదాలు, హత్యలు, ఆత్మహత్యలు జరిగిన శవాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా వైద్యశాలకు తెస్తుంటారు. అలాగే తెనాలి, చుండూరు, బాపట్ల, రేపల్లె, పొన్నూరు, జంపని, తదితర రైల్వే ట్రాకుల వద్ద జరిగిన ప్రమాదాలలో చనిపోయిన వారి మృతదేహాలను ఇక్కడికే తెస్తుంటారు. నెలకు సంఘటున 30 నుంచి 50 శవాలకు జిల్లా వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహిస్తుంటారు. ప్రతి రోజు శవాగారంలో 2 నుంచి 3 శవాలు ఉంటునే ఉంటాయి. అదే అనాథ శవాలకైతే పోస్టుమార్టం నిర్వహించి మున్సిపాలిటీ వారికి అప్పగిస్తారు.

ఆధునీకరించిన శవాగారం

శవాగారంలో పోస్ట్ మార్టం చేసేందుకు రెండు బల్లలు ఉంటాయి. వాటిపై శవాలను పోస్ట్ మార్టం చేయాలనే నిబంధన ఉంది. మొదట్లో ఆరుబయట వాటికి పోస్ట్ మార్టం నిర్వహించేవారు. కొద్ది సంవత్సరాల క్రితం వైద్యశాలను తనిఖీ చేసిన ఉన్నతాధికారులు బయట పోస్ట్ మార్టం చేయవద్దని బల్లలపై చేయాలని సూచించారు. అంతేకాకుండా దీనిని చేసేందుకు ఇద్దరిని అవుట్ సోర్సింగ్‌పై నియమించారు. అలాగే ప్రస్తుత వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి దీనిపై ప్రత్యకంగా దృష్టి సారించారు. ఆవరణను ఆధునీకరించారు. అలాగే ఆవరణలో మృతదేహాల కుటుంబ సభ్యులు కూర్చునేందుకు అవసరమైన షెడ్‌ను నిర్మించారు. ప్రస్తుతం తాగునీటి సదుపాయం, కిటికీలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

మొరాయిస్తున్న ఏసీ బాక్స్‌లు

తెనాలి జిల్లా వైద్యశాలలో శవాగారాన్ని ఏర్పాటు చేసిన సమయంలో రెండు శవాలు భద్రపరిచే ఏసీ బాక్సు ఒకటి ఏర్పాటు చేశారు. శవాల సంఖ్య పెరుగుతుండటం వాటిని భద్రపరిచే అవకాశం లేకపోవటంతో అధికారులు మరో బాక్సును ఏర్పాటు చేయాలని కోరారు. కొద్దిసంవత్సరాలకే రెండో బాక్సును తెనాలిలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉన్న రెండు ఏసీ బాక్సులలో నాలుగు శవాలను పెట్టే అవకాశం ఉంది. వాటిని ఏర్పాటు చేసి ఏళ్ల గడుస్తుండటంతో అవి తరచు రిపేర్లు వస్తున్నాయి. అధికారులు వాటిని బాగు చేయించడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వాటి కాలపరిమితి పూర్తి కావటం వల్ల ఇలా తరచూ రిపేర్లు వస్తున్నట్లు టెక్నీషియన్లు ఇటీవల తెలిపారు. దీంతో స్థానిక అధికారులు నూతన బాక్సుల కోసం ప్రతిపాదనలు పంపటంతో పాటు దాతలు ముందుకు వచ్చి వాటిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే జిల్లా వైద్యశాలలో నూతన ఏసీ బాక్సులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రతిపాదనలు పంపాం



శవాగారంలోని రెండు ఏసీ బాక్సులు తరచూ రిపేర్లు వస్తున్నాయి. వాటి స్థానంలో రెండు నూతన బాక్సులు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు ఇటీవల ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రావాల్సి ఉంది. ఈలోపు దాతలు ఎవరైనా ముందుకు వచ్చి ఏసీ బాక్సులను స్పాన్సర్ చేస్తే వైద్యశాలకు మేలు జరిగే అవకాశం ఉంటుంది.

–డాక్టర్ సౌభాగ్యవాణి. సూపరింటెండెంట్, జిల్లా వైద్యశాల, తెనాలి

నేడు ఐఎంఎల్ డిపోలో వేలం

తెనాలిరూరల్: తెనాలి ఐఎంఎల్‌డిపో పరిధిలో ఇటీవల వరకు నడచిన ప్రభుత్వ మద్యం దుకాణాల్లో వినియోగించిన 96 ఫ్రీజర్లు, 85 ఇన్వర్టర్‌కం బ్యాటరీలు, 99 క్యాష్ చెస్టులు, 208 స్కానర్లు, 105 క్యాష్ కౌంటింగ్ యంత్రాలు, వేలం వేయనున్నట్టు డిపో మేనేజర్ టా. శౌరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో గోడౌన్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు వేలం జరుగుతుందన్నారు. ఒక్కో ఫ్రీజర్‌కు రూ. 22,680, ఒక్కో ఇన్వర్టర్‌కు రూ. 18,630, క్యాష్ చెస్ట్ ఒక్కో దానికి రూ. 6,120, ఒక్కో స్కానర్‌కు రూ. 3,400, ఒక్కో క్యాష్ కౌంటింగ్ యంత్రానికి రూ. 810గా ధరలు నిర్ణయించామన్నారు. వీటికి అదనంగా 18 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుందని, ఆసకతి ఉన్న వారు నేరుగా వేలంలో పాల్గొనవచ్చని చెప్పారు.

సాల్వేషన్ ఆర్మీ చర్చిలో షియోన్ కుమారిచే ప్రమాణస్వీకారం



తెనాలి: పట్టణ అయితానగర్‌లోని సాల్వేషన్ ఆర్మీ చర్చికి బాపట్ల నుండి బదిలీపై వచ్చిన లెఫ్టినెంట్ కల్నల్ గ్రేరా థామస్ షియోన్‌కుమారిచే ప్రమాణస్వీకారం (అభిషేకం) గురువారం ఘనంగా నిర్వహించారు. కమాండర్ టేరి–టోరియర్, కమాండర్ యాకోబ్ సుమిత్ర మాసీలు గ్రేరా థామస్ షియోన్‌కుమారిచే ప్రమాణం చేయించారు. కమాండ్ యాకోబ్ సుమిత్రలను సంఘ కాపరులు, సంఘపెద్దలు, గృహసమితి, కోర్ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. మేజర్ పి.నాగరాజు, రత్నసుందరి, బట్టు జకరయ్య, గాలి రవికుమార్, పిల్లి కనకరత్నం, ఆర్.ఆశీర్వాదం, కె.నరసింహారావు పాల్గొన్నారు.

వైభవంగా బాలల దినోత్సవం

మున్నంగి(కొల్లిపర): మండలంలోని మున్నంగి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఆర్)లో ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం బాలలదినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. తొలుత విద్యార్థులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నావాళ్లులర్పించారు.అనంతరం ఉపాధ్యాయలు నిర్వహించిన వివిధ అంశాల పోటీలల్లో పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఉపాధ్యాయులు చిన్నపాటి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాము, ఉపాధ్యాయురాలు సోమరౌతు లక్ష్మీకమల పాల్గొన్నారు.

తెనాలిఅర్బన్: బాలల దినోత్సవ వేడుకలను బోసు రోడ్డులోని నెహ్రూనికేతన్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ మాట్లాడుతూ నెటి విద్యార్థులే రేపటి పౌరులు అని తెలిపారు. విద్యార్థులలోని నైపుణ్యాలను వెలికి తీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రస్సు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నెహ్రూనికేతన్‌లో మాట్లాడుతున్న దాసరి

విచక్షణతో ఉన్నతస్థాయికి ఎదగాలి

తెనాలి: పిల్లలకు చదువులే కాదు...ఆటపాటల్లోను వారికి ప్రాధాన్యత కల్పించాలని ప్రముఖ సినీరచయిత డ్టార్ సాయిమాధవ్ బుర్రా సూచించారు. కొలకలూరులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన బాల ల దినోత్సవ సభకు ప్రధానోపాధ్యాయుడు మాచర్ల నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి డాక్టర్ సాయిమాధవ్ మాట్లాడుతూ విద్యార్థులు కళాభిరుచిని కలిగి ఉండటం కూడా ముఖ్యమని చెప్పారు. విద్యార్థులు వారు ఎంచుకున్న రంగంలో అభివృద్ధి చెందటానికి కళలు తోడ్పడతాయని చెప్పారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ విజ్ఞానాభివృద్ధి కేవలం పాఠశాలతోనే సాధ్యపడదని చెప్పారు. పాఠశాల వెలుపల కూడా నేర్చుకోవాలనీ, అందుకు గ్రంథాలయాలను ఉపయోగించుకుని, జీవితాన్ని ఫలవంతం చేసుకోవాలని చెప్పారు. గ్రామ సర్పంచ్ డాక్టర్ చొప్పర ప్రీతి, అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, మాజీ సర్పంచ్ వల్లూరు వరప్రసాద్, పాఠశాల విద్యాకమిటి అధ్యక్షుడు జిలాని, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు వల్లూరు వెంకటేశ్వరరావు మెమోరియల్ ట్రస్ట్ బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయుడు ఎం.అన్నారావు పర్యవేక్షించారు.



మాట్లాడుతున్న సాయిమాధవ్ బుర్రా

మాజీ ప్రధాని నెహ్రూ సేవలు మరువరానివి

తెనాలిఅర్బన్: భారతదేశ మొట్ట మొదటి ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ అందించిన సేవలు మరువరానివని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెనాలి అధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణమూర్తి కొనియాడారు. మాజీ ప్రధాని నెహ్రూ జయంతిని కొత్తపేటలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో గురువారం నిర్వహించారు.

అట్టహాసంగా వివేక విద్యాసంస్థల సాంస్కృతిక ఉత్సవాలు

- తొలిరోజున ప్రత్యేక ఆకర్షణగా ప్రముఖ బాలనటి మోక్ష
- చదువుతోపాటు ఏదొక కళలో ప్రవేశం మంచిదని సూచన

తెనాలి: పట్టణానికి చెందిన వివేకా విద్యాసంస్థల బాలల దినోత్సవం సందర్భంగా సాంస్కృతిక ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఏటా మూడురోజులపాటు జరిగే ఈ వేడుకలను స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూలు ఆవరణలో గల ఏవీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ థియేటరులో గురువారం ఆరంభించారు. వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ అధ్యక్షత వహించారు. తొలిరోజున వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా ప్రముఖ బాలనటి మోక్ష హాజరయ్యారు. గత పదేళ్లుగా సినిమాలు, టీవీ, ఓటీటీ సీరియల్స్‌లో నటిస్తున్న మోక్ష, ఇప్పటికి 19 అవార్డులను అందుకున్నారనీ, తొమ్మిదో తరగతి చదువుతూ కూచిపూడి నాట్యం నేర్చుకుంటూ బాలనటిగా కొనసాగుతున్న మోక్ష బాలలందరికీ స్ఫూర్తిగా డాక్టర్ వీరనారాయణ చెప్పారు.



బాలనటి మోక్ష, శంకరీ రాజ్యలక్ష్మి, రత్నాకర్‌కు అభినందన సత్కారం

బాలనటి మోక్ష తన ప్రసంగంలో విద్యార్థులు చదువుతోపాటు ఏదొక కళలో ప్రవేశం సంపాదించటం మంచిదని సూచించారు. కళాసాధనతో ఏకాగ్రత, మనోధైర్యం అలవడతాయని, మొత్తంగా మానసిక వికాసం, ఏ పరిస్థితినైనా తట్టుకునే స్వభావం కలుగుతాయని చెప్పారు. ప్రసంగం అనంతరం మోక్ష, సినిమాల్లోని డైలాగులను చెప్పటమే కాకుండా, సినీగీతాలకు నర్తించి మరీ చిన్నారులను ఆనందింపజేశారు. శ్రీవివేకానంద సెంట్రల్ స్కూల్ సీఈవో రావిపాటి వెంకటరామ్ తన ప్రసంగంలో, బాలల దినోత్సవం ప్రత్యేకతను వివరించారు.

చంద్రశేఖర్ అజాద్‌కు కేంద్ర బాలసాహిత్య అకాడమీ అవార్డు



తెనాలి: ప్రసిద్ధ బాల సాహితీవేత్త, కథ, నవల రచయిత, కాలమిస్ట్, టెలీఫిలింస్ రచయిత పి.చంద్రశేఖర్ అజాద్ కేంద్రబాలసాహిత్య అకాడమీ అవార్డును స్వీకరించారు. ఆయన రచించిన బాలల కథల పుస్తకం 'మాయాలోకం'కు గత జూన్‌లో కేంద్ర బాల సాహిత్య అకాడమీ అవార్డును ప్రకటించిన విషయం తెలిసిందే. లక్నోలోని భాగీరథి భవన్ ఆడిటోరియంలో గురువారం సాయంత్రం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో సాహిత అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్, ఉపాధ్యక్షుడు కుముద్‌శర్మ చేతులమీదుగా ఈ అవార్డును చంద్రశేఖర్ అజాద్ అందుకున్నారు.

నేడు సూపర్‌స్టార్ కృష్ణ జీవిత సాఫల్య పురస్కారం మహోత్సవం

తెనాలి: కళల కాణాచి–తెనాలి, వేదగంగోత్రి ఫౌండేషన్–విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం సూపర్‌స్టార్ కృష్ణ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన పేరిట జీవిత సాఫల్య పురస్కార మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో సాయంత్రం 5 గంటలకు ఏర్పాటయే సభలో ప్రముఖ మేకప్ కళాకారుడు చేబ్రోలు మాధవరావుకు పురస్కారాన్ని ప్రదానం చేస్తారు.

ఘనంగా ఆరంభమైన గ్రంథాలయ వారోత్సవాలు

తెనాలి: స్థానిక నెహ్రూరోడ్డులోని గ్రేడ్–1 శాఖాగ్రంథాలయంలో 57వజాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. పట్టణ మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న జ్యోతిప్రజ్వలనతో వారోత్సవాలను ప్రారంభించారు. పుస్తక పఠనం ఆవశ్యకత, గ్రంథాలయాల వినియోగంతో కలిగే ప్రయోజనాలను కమిషనర్ వివరించారు. నేటి మేధావుల్లో ఎందరో చిన్నతనంలో గ్రంథాలయకు వెళ్లినవారేనని చెప్పారు.

తెనాలిరూరల్: మండల గ్రామాల్లోని గ్రంథాలయాల్లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తెనాలి మండలం కొలకలూరులోని శాఖా గ్రంథాలయంలో 57వ గ్రాంథాలయ వారోత్సవాలను ప్రారంభోత్సవంలో శ్రీ వర్ధనీ స్కూల్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి, న్యూ చైతన్య స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు విజయ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించారు.

వల్లభాపురం(కొల్లిపర): విద్యార్థులు చిన్న వయసు నుండి గ్రంథాలయాలల్లో ఉంచిన మంచి పుస్తకాలను కొంత సమయం చదవటం వలన చదువుపై ఆసక్తి కలగటమే కాకుండా జ్ఞానాన్ని పెంచుకోవచ్చు అని ఉపసర్పంచ్ అవుతు పోతిరెడ్డి అన్నారు. మండలంలోని వల్లభాపురం గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ప్రాంబించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ ఉపసర్పంచ్ పాల్గొన్ని ప్రారంభించి విద్యార్థులకు నిత్యం పుస్తక పఠనం వలన కలుగు ప్రయోజనాలు వివరించారు.



నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అతిథులు, విద్యార్థులు

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ సిరి

తెనాలిఅర్బన్: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చూడాలని సెకండరీ హెల్త్ విభాగ రాష్ట్ర డైరెక్టర్, ఐఏఎస్ అధికారిణి డాక్టర్ సిరి సూచించారు. తెనాలి జిల్లా వైద్యశాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలో నిర్వహిస్తున్న ఈ హాస్పటల్ సేవలపై ఆరా తీశారు. రోగుల వివరాలు సక్రమంగా నమోదు చేస్తున్నారా లేదా అనేది పరిశీలించి, అలాగే సెమిసర్వీసెస్ సేవల వివరాలను పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంత మంది గుండె సంబంధిత రోగులకు ప్రథమ చికిత్స అందించారు అనే దానిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే వైద్యశాలలోని ల్యాబ్‌లను పరిశీలించి అక్కడ అందిస్తున్న టెస్టులపై ఆరా తీశారు. టెస్ట్ రిపోర్టులు త్వరగా ఇచ్చే విధంగా చూడాలన్నారు. అలాగే ఓపీ విభాగాన్ని, పలువార్డులను పరిశీలించి అక్కడ రోగులతో మాట్లాడారు. వైద్యశాలలో అందిస్తున్న సేవలు సంతృప్తికరంగా ఉన్నాయాలేదా అనే దానిపై ఆరా తీశారు. వైద్యశాలకు అవసరమైన ఎక్యూప్‌మెంట్‌లు,ఇతర మౌళిక వసతుల వివరాలనువైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి ఆమెకు తెలియజేశారు. వాటిని త్వరగామంజూరు చేయించే విధంగా చూడాలని కోరండంతో ఆమె సానుకూలంగా స్పందించారు. ఆమె వెంట జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రవి కిషోర్, అధికారులు ఉన్నారు.



వైద్యసేవలపై ఆరా తీస్తున్న డాక్టర్ సిరి

మధుమేహ బాధితులకు వ్యాయామం తప్పనిసరి

తెనాలిరూరల్: షుగర్ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండ వ్యాయామం చేయాలని కొలకలూరు ప్రథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు తెలిపారు. ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ మధుమేహంతో బాధపడుతున్న వారు ఆహార నియమాలు పాటిస్తూ ఎప్పటికప్పుడు వైద్యుల సలహాలు తీసుకోవాలన్నారు. ర్యాలీలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ సుబ్బారావు, సిబ్బంది

మధుమేహ వ్యాధితో అప్రమత్తంగా ఉండండి

తెనాలిఅర్బన్: మధుమేహ వ్యాధిపట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని పీజీ వైద్యులు డాక్టర్ మంజూష, డాక్టర్ విజయ్ సూచించారు. ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్యశాలలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తీపి వస్తువులు ఎక్కువగా తిన్నకుండా ఉండాలన్నారు. అలాగే వంశపరంపర్యంగా వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. ప్రతిరోజు వ్యాయామం చేయడం వలన షుగర్‌ను అదుపులో ఉంచవచ్చున్నారు. సమావేశంలో ఫిజియోథెరపిస్టు ఎస్.అపర్ణ, ఎన్‌సీడీ క్లినిక్ సిబ్బంది సత్తార్, మధులత, శ్రావణి, పరిపూర్ణ, రాజేష్, అనురాధ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ మంజూష

సెల్‌ఫోన్‌తో అనుబంధాలు దూరం

ప్రముఖ నటుడు, రచయిత వంజారి కృష్ణమూర్తి



తెనాలి: నేటితరం సెల్ ఫోన్‌తో ఎక్కువసేపు గడుపుతూ తల్లిదండ్రులు, పిల్లలు పరస్పరం ప్రేమను అందిపుచ్చుకోవటం లేదని ప్రముఖ నటుడు, రచయిత వంజారి కృష్ణమూర్తి అభిప్రాయపడ్డారు. స్థానిక అయితానగర్‌లోని ఎస్ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూలులో గురువారం జరిగిన బాలల దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చిత్రలేఖనం, ఆటలు, పాటలు, చదువు, క్రమశిక్షణలో రాణించిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. పదోతరగతిలో మొదటి మూడు స్థానాల్లో మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు రూ.15 వేల నగదు బహుమతులను ఇవ్వనున్నట్టు వంజారి కృష్ణమూర్తి ప్రకటించారు. ఇన్‌ఛార్జి హెచ్‌ఎం సునీత అధ్యక్షత వహించారు. ప్రసూనాదేవి, సోమశేఖర్, మనోజ్, కరిముల్లా, జాన్‌బీ, స్వర్ణమంజరి, సంపూర్ణ, నీలిమా ప్రశాంతి, శారద, శ్రీను పాల్గొన్నారు.

ఎన్‌సీడీ-సీడీ సర్వే 100 శాతం పూర్తి చేయాలి

ఎంపీపీ పద్మావతి

కొల్లిపర: వచ్చే వారంలోపు మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్‌సీడీ–సీడీ సర్వే 100 శాతం పూర్తి చేయాలరి ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవ రెడ్డి వైద్యాధికారులను, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌యంల కు ఆదేశించారు. గురువారం స్థానిక ఆరోగ్య ఉపకేంద్రంలో మండల వైద్యాధికారి సి.హెచ్.లక్ష్మిసుధ ఆధ్వర్యంలో ఎన్‌సీడీ–సీడీ సర్వే ఎంపీపీ పద్మావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసాంక్రమిక వ్యాధుల(ఎన్‌సీడీ) కట్టడిలో భాగంగా ఇంటింటికి సార్వత్రిక ఆరోగ్య పరీక్షల కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. మండల వైద్యాధికారి లక్ష్మిసుధ మాట్లాడుతూ 18సంవత్సరాలు పై బడిన వారందరికి ఆరోగ్య సిబ్బంది స్వయంగా ఇంటింటికి వచ్చి మధుమేహం, రక్తపోటు, బాడీ మాస్ ఇండెక్స్(బీయంఐ) సహా పలు రకాల సస్పెక్టెడ్ కేసులను, స్క్రీనింగ్, బీపీ పరీక్షలను నిర్వహించి అత్యవసరమైన వారిని జిల్లా వైద్యశాలలో చికిత్స కొరకు రిఫర్ చేయటం జరుగుతుందన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది